క్లుప్తంగా

'కంటివెలుగు'ను వినియోగించుకోండి

మోమిన్‌పేట: కంటివెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకొని ప్రతి ఒక్కరూ కంటి పరీక్ష చేయించుకోవాలని సర్పంచ్ సావిత్రమ్మ చెప్పారు. బుధవారం రాళ్లగుడుపల్లి గ్రామంలో నేత్ర వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అంధత్వ నివారణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని కంటి పాపాను కాపాడుకోవాలని సర్పంచ్ సూచించారు. నేత్ర పరీక్ష అనంతరం మందులు, అవసరమైన వారికి అద్దాలు, శస్త్రచికిత్స కూడా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే చేయిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ తనిఖీ



బస్టాండ్ పరిశీలిస్తున్న అధికారులు

కొడంగల్: కొడంగల్ బస్టాండ్‌ను ఆర్టీసీ ఆర్‌ఎం శ్రీధర్, తాండూరు డీఎమ్ సమత, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రోహిణి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండులో పరిసరాలను పరిశీలించారు. వేసవి కాలంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా బస్టాండులో కూలర్లు ఏర్పాటు చేస్తామని, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మరుగు దొడ్లను ఉచితంగా వినియోగించుకోవాలని ప్రయాణికులకు సూచించారు. బస్టాండ్ ఖాళీ స్థలంలో దుకాణాలు ఏర్పాటు చేయడానికి టెండర్లు పిలుస్తామన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ పీఎస్ రెడ్డి, శేఖర్, రాములు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ గ్రామ కమిటీ ఎన్నిక

దౌల్తాబాద్: బహుజన సమాజ్ పార్టీ గ్రామ కమిటీని బుధవారం అంతారంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మదకిష్టప్ప ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా మాణిక్యప్ప, కార్యదర్శిగా నాగిరెడ్డి, కన్వీనర్‌గా రమేష్, కో కన్వీనర్‌గా వెంకటేశ్‌ను నియమించారు. ఈ సందర్భంగా కిష్టప్ప మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా పనిచేయాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు.

అడిగిన వారందరికీ 'ఉపాధి'

కుల్కచర్ల: అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధిహామీలో పనులు కల్పిస్తామని ఏపీఓ వెంకటేశ్ గౌడ్ చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ.. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ప్రజలందరూ తమ గ్రామాల్లో నిర్వహించే ఉపాధి పనుల్లో భాగంగా తమకు పనులు కల్పించేందుకు జాబ్‌కార్డులు పొందాలని సూచించారు. నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో కొత్తగా వంద రోజులు పని చేసుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం రూ.272 చొప్పున ఒక రోజు కూలి చెల్లించడం జరుగుతుందని, పనులు నిర్వహించేందుకు తమ గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్లు లేదా పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లను సంప్రదించవచ్చని చెప్పారు.

వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ధారూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ధారూరు పోలీసులు బుధవారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని బాచారంలో హెల్మెట్ వాడకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రోడ్లపై జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులే మృత్యువాత పడుతున్నారని, హెల్మెట్ వాడక పోవడం వలనే ఇలా జరుగుతోందని చెప్పారు. హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, లేని పక్షంలో ఏప్రిల్ 1 నుంచి కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

నేడు నో నాన్‌వెజ్

తాండూరు: తాండూరు మున్సిపల్ పరిధిలోని మాంసాహార దుకాణాలను నేడు(గురువారం) మూసి వేయాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. శ్రీ రామనవమి పండుగ సందర్భంగా మటన్, చికెన్, చేపలు తదితర మాంసాహార దుకాణాలు మూసి వేసేలా చర్యలు చేపట్టారు. మరోవైపు హోటళ్లలో నాన్‌వెజ్ వంటకాలు వండరాదని హోటల్ యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు మున్సిపల్ అధికారులు చెప్పారు.

గ్రామస్తుల సహకారంతోనే అవార్డు

తాండూరు రూరల్: మండల పరిధిలోని గౌతపూర్ గ్రామం 'జాతీయ ఉత్తమ పంచాయతీ' అవార్డు సాధించడంపై సర్పంచ్ రాజప్పగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. గ్రామస్తుల సహకారంతోనే అవార్డు వచ్చిందని తెలిపారు. వచ్చిన అవార్డుతో పొంగి పోకుండా.. మరింత బాధ్యతతో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని సర్పంచ్ తెలిపారు.

రిబేటు రాదాయే.. రుణమాఫీ కాదాయే

- కర్షకులకు తప్పని కష్టాలు
- కళ్లుకాయలు కాసేలా ఎదురు చూపులు
- బ్యాంకులకు అందని ప్రభుత్వ ఆదేశాలు
- వడ్డీలకు తెచ్చి.. అప్పు చెల్లించాల్సిన దుస్థితి
- పరేషాన్‌లో చిన్న సన్నకారు రైతులు

కొడంగల్: పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో పంట రుణాలు తీసుకున్న రైతుల పరిస్థితి ముందు నొయ్యి వెనుక గొయ్యిలా మారింది. ఏటా మార్చి నెలలో క్రమం తప్పకుండా రుణాలు చెల్లించిన వారికి గతంలో రిబేటు ఇచ్చేవారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత సకాలంలో రుణాలు చెల్లించినా.. రైతులకు రిబేటు ఇవ్వడం లేదు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ జరుగుతుందా అంటే అదీ లేదు. ఇప్పటి వరకు బ్యాంకుల్లో రుణమాఫీ కావడం లేదు. గతంలో రూ.25వేలు, రూ 50వేలు మాఫీ చేస్తామని సర్కార్ ప్రకటించింది. వాటిని కూడా పూర్తి స్థాయిలో చేయలేదు. ప్రస్తుతం రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం ప్రకటించింది. మార్చి నెల ముగుస్తున్నా ఇప్పటి వరకు ఆ ఊసే లేదు. రుణాలను రెన్యూవల్ చేయించుకోవడానికి రైతులు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు తీసుకొని బ్యాంకులకు అప్పు చెల్లిస్తున్నారు.

రిబేటుకు చరమగీతం!

జిల్లాలో వేలాది మంది రైతులు వ్యవసాయ సహకార సంఘాలు, బ్యాంకుల్లో రుణాలు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. పంట రుణాలతో పాటు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో రిబేటు పథకానికి శ్రీకారం చుట్టారు. రుణం తీసుకున్న రైతులు సకాలంలో బ్యాంకులకు కిస్తులు కడితే ఆరు శాతం రిబేటును ప్రభుత్వం చెల్లించేది. బ్యాంకులకు చెల్లించాల్సిన మిత్తిలో సగ భాగం ప్రభుత్వం భరించేది. అప్పట్లో బ్యాంకులు, సహకార సంఘాల్లో రుణాలు తీసుకున్న రైతులు మార్చి 31వ తేదీలోపు కిస్తులు చెల్లించి రిబేటు పొందేవారు. వైఎస్ మరణానంతరం కొంతకాలం రిబేటు పథకం కొనసాగినా.. తెలంగాణ ఏర్పాటు అనంతరం చరమగీతం పాడారు. దీంతో రైతులకు అపార నష్టం జరుగుతోంది. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా రైతులు దీర్ఘకాలిక రుణాలు తీసుకున్నారు. అందులో సగం మందికి పైగా రైతులు గతం నుంచి సకాలంలో కిస్తులు మార్చి చివరి వరకు చెల్లించారు. వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రిబేటు మాత్రం రావడం లేదని రైతులు వాపోతున్నారు.

ఒకేసారి మాఫీ చేయాలి

2018 ఎన్నికల్లో కేసీఆర్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి నాలుగేళ్లు దాటినా రుణమాఫీ కావడం లేదు. ఈ దఫా అసెంబ్లీ సమావేశాల్లో రుణమాఫీ పథకానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఏకకాలంలో మాఫీ చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. మూడు నెలల్లో ఖరీఫ్(వానాకాలం) సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రుణమాఫీ కోసం రైతులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

6 వేల మందికి రుణాలు

కొడంగల్ నియోజకవర్గంలో రైతులకు ఇచ్చిన పంట రుణాల వివరాలు పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. కొడంగల్ డీసీసీబీ బ్యాంకు పరిధిలో ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 6వేల మంది రైతులకు పంట రుణాలు ఇచ్చారు. గ్రామీణ వికాస్ బ్యాంకులో సుమారు రూ.20 కోట్ల వ్యవసాయ రుణాలు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు. స్టేట్ బ్యాంకులో రూ.10కోట్లకు పైగా.., యూనియన్ బ్యాంకులో రూ.8 కోట్ల రుణాలు ఇచ్చినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలుస్తోంది. కొడంగల్‌తో పాటు దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లో పలు బ్యాంకులు, సహకార సంఘాలు రైతులకు అధిక మొత్తంలో రుణాలు ఇచ్చాయి.



కొడంగల్ డీసీసీబీ బ్యాంకు

రైతు కష్టాన్ని గుర్తించాలి..



ప్రభుత్వం రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి. ఒకేసారి మాఫీ చేస్తే మేలు జరుగుతుంది. సకాలంలో పంట రుణాలు చెల్లించిన రైతులకు రిబేటు ఇవ్వాలి. ఆరుగాలం కష్టించి పనిచేస్తే.. ఏడాదికి ఒక్కసారే ఫలితం దక్కుతుంది. రైతుల కష్టానికి తగిన గుర్తింపు ఇవ్వాలి. – చుక్కయ్య, రైతు, కొడంగల్

చిరుధాన్యాలతో పోషకాలు పుష్కలం

- 'పోషన్ అభియాన్'ను విస్తృతం చేయాలి
- అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

వికారాబాద్ అర్బన్: పిల్లలు, మహిళల్లో పోషకాహార స్థితిని మెరుగు పర్చేందుకు కేంద్ర ప్రభుత్వం పోషన్ అభియాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని, ఈ కార్యక్రమం పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక లోపాన్ని అధిగమించేందుకు భిన్నమైన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చిరుధాన్యాల ఆహారంతో పోషకాలు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి, డీపీఓ తరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పోషన్ అభియాన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు

కల్యాణోత్సవానికి ఆలయాలు ముస్తాబు

- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు
- ముందస్తుగా ఎదుర్కోళ్లు

అనంతగిరి: అనంతగిరి గుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో గురువారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా గురువారం ఉదయం నుంచే ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి కల్యాణం, అన్నదానం నిర్వహించనున్నారు. వికారాబాద్ పట్టణంలోని రామమందిరంలో సుప్రభాత సేవతో ప్రారంభమయ్యే ఉత్సవాల్లో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, మధ్యాహ్నం డోలారోహనం, సాయంత్రం స్వామి కల్యాణోత్సవం జరగనుంది.

ఘనంగా ఎదుర్కోళ్లు

బొంరాస్‌పేట: సాధారణంగా గ్రామాల్లో వివాహానికి ముందు రోజు పెళ్లి కూతురును తీసుకువస్తారు. లగ్నపత్రికను తయారు చేసి ఊరంతా పంచుతారు. కానీ బుధవారం ఇక్కడ భూలక్ష్మమ్మ కూడలి నుంచి సంగమేశ్వర భక్త సమాజం వరకు ఉదయం అభిషేకం, సాయంత్రం ఎదుర్కోళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు. ఊరంతా సీతారాముల కల్యాణ ఉత్సవాలు నిర్వహించారు. గురువారం (నేడు) ఉదయం 11.55 గంటలకు కల్యాణోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



అనంతగిరి: ముస్తాబైన రామాలయం



బొంరాస్‌పేట: ఎదుర్కోళ్ల కార్యక్రమం

టేకుల్‌కోడ్‌లో..

కొడంగల్ రూరల్: టేకుల్‌కోడ్ గ్రామంలో శ్రీవీరాంజనేయస్వామివారి దేవాలయంలో గురువారం ఉదయం 11.45గంటలకు రాములవారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- వీసీలో కలెక్టర్ నారాయణరెడ్డి
- ఎగ్జామ్ సెంటర్లలో సీసీల ఏర్పాట్లకు ఆదేశం
- టీఎన్జీఓ డైరీ ఆవిష్కరించిన కలెక్టర్

వికారాబాద్ అర్బన్: పదో తరగతి పరీక్షలు నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. టెన్త్ పరీక్షల నిర్వాహణ నేపథ్యంలో బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఏర్పాటు చేసిన 74 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విధంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలని, బస్టాండ్లలో సహాయక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వీసీలో అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీఈఓ రేణుకాదేవి, డీఎంహెచ్‌ఓ సాల్వాన్ కుమార్, అడిషనల్ ఎస్పీ మురళీధర్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

డైరీ ఆవిష్కరణ

తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ (టీఎన్జీఓ) డైరీ, క్యాలెండర్‌ను కలెక్టర్ నారాయణ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయగంటి ప్రతాప్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. రాజేందర్ మాట్లాడుతూ పాలనలో జిల్లాను టాప్ ఐదో స్థానంలో ఉంచేందుకు ఉద్యోగులు అన్ని విధాలుగా కృషి చేస్తారని చెప్పారు.

కాలిన వాటి స్థానంలో కొత్త మొక్కలు



నాటిన కొత్త మొక్కలు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: 'అగ్ని కీలలకు హరిత మొక్కలు హరీ' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురించిన వార్తా కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. పెద్దేముల్ మండలం తట్టెపల్లి వద్ద తాండూరు–జహీరాబాద్ ప్రధాన రహదారికి ఇరు వైపులా రెండేళ్ల క్రితం నాటిన మొక్కలు.. గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డు పక్కన నిప్పు పడేయడంతో అవి కాలిపోయాయి. ఇదే విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉపాధిహామీ, పంచాయతీ కార్యదర్శులు వాటి స్థానంలో కొత్తవి నాటారు.

తైబజార్ వేలంతో రూ.5.50 లక్షల ఆదాయం

బషీరాబాద్: బషీరాబాద్ పంచాయతీ తైబజార్‌కు సర్పంచ్ ప్రియాంక ఆధ్వర్యంలో అధికారులు నిర్వహించిన వేలం పాటలో గడ్డమీది ప్రభాకర్, మాదోజి, తాహేర్ ముగ్గురు వ్యక్తులు పాల్గొన్నారు. వీరిలో ప్రభాకర్ రూ.5.50 లక్షలకు వేలంలో తైబజార్‌ను కైవసం చేసుకున్నట్లు ఎంపీడీఓ రమేష్‌కుమార్ తెలిపారు. వేలంతో జీపీకి రూ.5.50లక్షల ఆదాయం సమకూరిందని, ఆ నిధులను గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తామని సర్పంచ్ తెలిపారు.

తెరుచుకున్న యూనియన్ బ్యాంక్

బంట్వారం: 'కరోనాతో కోట్‌పల్లి యూనియన్ బ్యాంక్ బంద్' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. బ్యాంకు తెరవడంతో ఆరోగ్య కార్యకర్తలను బ్యాంకు వద్దకే పంపించి నలుగురు ఉద్యోగులకు కోవిడ్ టెస్టు చేశారు. అలాగే వీరి నమూనాలను ఆర్‌టీపీసీఆర్ టెస్టుకు పంపించామని డాక్టర్ గీతిక తెలిపారు. మరో ఇద్దరు వ్యక్తులకు కూడా ఆసుపత్రిలో టెస్టు చేశామని చెప్పారు. ర్యాపిడ్ టెస్టులో బ్యాంకు ఉద్యోగులతో పాటు మరో ఇద్దరికి కూడా నెగెటివ్ రిపోర్టు వచ్చిందన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు

- ప్రజా సమస్యలు పట్టని పాలకులు
- జోడో యాత్రలో కాంగ్రెస్ నేతలు

దౌల్తాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు ఆరోపించారు. బుధవారం మండలంలోని ఈర్లపల్లి, ఊరగుంట గ్రామాల్లో హాత్‌సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారం చేస్తూ.. ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రజాసంక్షేమం కోసం పాటుపడాల్సిన పాలకులు ఖజానా నింపుకొనేందుకు ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా.. ఇక్కడి పాలకులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, వీరయ్య, సత్యపాల్, వెంకట్రాములు, మాధవరెడ్డి, కృష్ణ, మహిపాల్ పాల్గొన్నారు.

మీ జీవితానికి సురక్ష 'బీమా'



సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఓ

- రుణాల లక్ష్యం నెరవేర్చండి..
- ఏపీఎం బాలయ్య

పెద్దేముల్: మీ జీవితానికి రక్ష.. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన అని, ఆ పథకం ప్రతి కుటుంబానికి ఉండాలని, ఎవరికైనా లేకపోతే వెంటనే బీమా చేసుకోవాలని ఏపీఓ బాలయ్య చెప్పారు. బుధవారం మండల మహిళా సమాఖ్య భవనంలో అధ్యక్షురాలు అండాలమ్మ అధ్యక్షతన జరిగిన ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్యాంకింగ్ వ్యవస్థ, సామాజిక భద్రత, ఇన్స్‌రెన్స్‌పై అవగాహన కల్పించారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో 947 సంఘాలు, 9,833 మంది సభ్యులు ఉన్నారు. 2022–23 సంవత్సరానికి టార్గెట్ రూ.30కోట్ల 78 లక్షలు రుణాలు అందజేయవలసి ఉండగా.. ఇప్పటి వరకు రూ.29కోట్ల 40లక్షలు రుణాలు 424 సంఘాలకు అందజేయడం జరిగిందని తెలిపారు. మిగతా సంఘాలకు ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని సీసీలను ఆదేశించారు. రుణాలు తీసుకున్న సంఘం సభ్యులు సకాలంలో చెల్లించి, సంఘం అభివృద్ధికి పాటుపడాలని చెప్పారు. సమాఖ్య సంఘం ఉపాధ్యక్షురాలు యశోద, కార్యదర్శి అక్షయ ఉన్నారు.

రోడ్డు మరమ్మతుకు రూ. లక్ష విరాళం



వేదికపై మాట్లాడుతున్న శరత్ కుమార్

దోమ: గుంతల రోడ్డుతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి మండల పరిధిలోని బట్ల చందారంలో వీధి నాటక ప్రదర్శన తిలకించేందుకు వెళ్తున్న క్రమంలో.. గ్రామానికి వెళ్లే మెటల్ రోడ్డు గుంతల మయంగా మారిందని గుర్తించారు. నాటకం వీక్షించిన అనంతరం గుంతల రోడ్డును బాగు చేయించుకోవాలని గ్రామస్తులకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైందని, ప్రజల ఇబ్బందిని గమనించి, రోడ్డు మరమ్మతుకు తనవంతు సహాయం అందజేశానని తెలిపారు.

అర్హులందరూ అర్జీ పెట్టుకోవాలి

పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం: ఎంపీపీ

పరిగి: అర్హులైన ప్రతి ఒక్కరూ డబుల్ బెడ్‌రూంల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీపీ అరవింద్ రావు అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో డబుల్ బెడ్‌రూం దరఖాస్తులను ఆయన స్వీకరించి మాట్లాడారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం పథకాన్ని తీసుకు వచ్చిందని, అర్హులందరూ అర్జీ పెట్టుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకుడు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అడవివెంకటాపూర్‌లో..

కుల్కచర్ల: డబుల్ బెడ్రూం ఇళ్ల అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చౌడాపూర్ తహసీల్దార్ అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చౌడాపూర్ మండల పరిధిలోని అడవివెంకటాపూర్ గ్రామ పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పొందేందుకు అడవివెంకటాపూర్, గోగ్యానాయక్‌తండా, భజ్యానాయక్‌తండా, వాటి అనుబంధ గ్రామాలకు చెందిన వారు మాత్రమే వీటిని పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ అర్జీలను ఈ నెల 31వ తేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు ప్రతిరోజు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు భజ్యానాయక్‌తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో చేసుకోవాలని సూచించారు.




దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీపీ తదితరులు

క్షయ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

- రోగులకు ఉచితంగా ఔషధాల పంపిణీ
- టీబీ నియంత్రణ అధికారి రాజు నాయక్

దోమ: క్షయ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని టీబీ నియంత్రణ అధికారి రాజు నాయక్ తెలిపారు. బుధవారం మండల పరిధిలోని మోత్కూర్ ఆరోగ్య ఉపకేంద్రం ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య మేళాలో టీబీపై రోగులకు అవగాహన కల్పిస్తూ.. అవసరమైన వారికి ఆరోగ్య పరీక్ష చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్షయ నిర్మూలపై ప్రత్యేక దృష్టి సారించిందని, గ్రామాల్లో ఉన్న రోగులకు మందులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా వ్యాధి లక్షణాలు ఉన్న వారికి రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, సాయంత్రం కాగానే చలివేస్తుండడం, చెమట పట్టడం, ఆకలి తగ్గిపోవడం, తొందరగా అలసిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయన్నారు. అలాంటి వారిని గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేసేలా కృషి చేస్తున్నామన్నారు. రోగులకు ప్రతి నెల ప్రభుత్వం రూ.500, పౌష్టికాహారం ఉచితంగా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం కాంతమ్మ, ఆశ వర్కర్లు యాదమ్మ, సత్యమ్మ, శోభ, శివరాణి తదితరులు పాల్గొన్నారు.



రోగులకు అవగాహన కల్పిస్తున్న రాజు నాయక్

మధ్యాహ్నం లోపు ధాన్యం తీసుకురావాలి

పరిగి: రైతులు తమ ధాన్యాన్ని మధ్యాహ్నం లోపు మార్కెట్‌కు తీసుకురావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధాన్యం ఆలస్యంగా తీసుకురావడం వలన బీట్లు ఆలస్యం అవుతున్నాయన్నారు. అంతే కాకుండా తూకంలో మోసం జరుగుతుందని, ధరల విషయంలో దళారులు ఇష్టంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సకాలంలో ధాన్యం తీసుకువస్తే అంతా సవ్యంగా సాగుతుందని ప్రకటించారు.

పచ్చదనంతో కళకళ

మోమిన్‌పేట: తహసీల్దార్ కార్యాలయం చుట్టూ నాటిన చెట్లు, పరుచుకున్న పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. దీంతో అక్కడికి వచ్చే రైతులు.. నందనవనంలా కళకళలాడుతున్న తహసీల్ ఆఫీసును చూసి.. పచ్చని పంటపొలాలను తలపిస్తోందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పనిచేసే చోట వాతావరణం బాగుంటే.. పనితీరులో మార్పు సహజమన్నారు.



మోమిన్‌పేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట పరుచుకున్న పచ్చదనం